www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 02 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 8

## సిఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ



2లో

# మెట్ట పంటలకు వాన దెబ్బ







-పత్తి, పెసరకు అపార నష్టం
-పరివాహక ప్రాంతాల్లో ముంపుకు గురైన పంట భూములు
-జాలిముడి ప్రాజెక్టు కాలువకు గండి
-పలు చోట్ల వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం
-14 అడుగులకు చేరిన మున్నేరు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారీ వర్షాలకు మెట్ట పంటలకు అపార నష్టం వాటిల్లింది. గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, నదులు, ఏర్ల పరివాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. కొన్ని చోట్ల గడిచిన 24 గంటలుగా పంటలు నీటిలోనే ఉన్నాయి. పలు చోట్ల పంట భూములు కోతకు గురైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మెట్ట పంటలైన పెసర, పత్తి పంటలను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది పెసర పంటకు సంబంధించి కనీసం కోసే పరిస్థితి లేకుండా పోయింది. విత్తు కూడా ఇంటికి చేరలేదంటే అతిశయోక్తి కాదు. గడేడాది పత్తి పంటను నష్ట పరిచ్చినట్లుగానే ఈ ఏడాది కూడా వాతావరణం అననుకూలంగానే మారుతుంది. భారీ వర్షాల కారణంగా పత్తి పంట ఎర్రబారింది. పల్లపు భూముల్లో సాగు చేసిన పత్తి గడ్డి వేసిందని తొలగించడం తప్ప మరో మార్గం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పెట్టాల్సినంత పెట్టుబడి పెట్టామని తీరా ఇప్పుడు వర్షాలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. పత్తి రైతులకు కష్టాలు, నష్టాలు మిగిలే సూచనలే కనిపిస్తున్నాయి. భారీ వర్షాలకు జాలిముడి ప్రాజెక్టుకు గండి పడింది. కుడి కాలువ పరిధిలోని

మిగతా 2లో..

## వరద ప్రాంతాల్లో పర్యటించండి

**యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి**
**పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**అధికారులను ఆదేశించిన కూనంనేని**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** భారీ వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని ప్రభుత్వ శాఖల అధికారులను కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. హైదరాబాద్ ఉన్న సోమవారం మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్, పంచాయతి, పోలిసు, రెవెన్యూ తదితర జిల్లా, డివిజన్ అధికారులను ఆదేశించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాలు, బస్తీల్లోని అంతర్గత రహదారులు దెబ్బ తిన్నాయని తక్షణమే పునర్నిర్మాణం చేపట్టి పరిస్థితిని చక్కదిద్దాలని, దిబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంబాలు ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్దరించాలని సూచించారు. పారిశుద్ధంపై ప్రత్యేక ధ్రుష్టి సారించాలని, ప్రత్యేక డ్రైవులు చేపట్టి ప్రజలు జబ్బులబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవసరైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స అందించాలని ఇండ్లు కోల్పోయిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు కృషిచేస్తానని, ప్రభుత్వం ద్వా రా పరిహారం చెల్లించేవిధంగా అదేవిధంగా పంటల నష్టంపై సర్వే చేపట్టి నష్ట అంచనాను ప్రభుత్వానికి నివేదించడం ద్వారా బాధితుల్ని పరిహారం అందే విధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. నిర్వాసితులుగా మ రిన్ని కుటుంబాలని తక్షణమే పునరావాసి కేంద్రాలు ఏర్పాటు చేసి సకలసౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ప్రజ ల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

## హామీలు అమలు కాకపోతే ఉద్యమ కార్యాచరణ



-కలెక్టరేట్ ఎదుట జేఏసి ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం

సెంటర్‌స్ప్రెడ్

## నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

-పంటలను పరిశీలించిన సిపిఐ బృందం



ఖమ్మం జిల్లాలో

2లో



భద్రాద్రి జిల్లాలో

సెంటర్‌స్ప్రెడ్

# మెట్ట పంటలకు వాన దెబ్బ



**(మొదటిపేజీ తరువాయి)**

బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాల మధ్య గండిపడి నీరు వృథాగా పోతుంది. దీనితో జాలిముడి ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. పలు చోట్ల వాగులు పొంగిపొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద ఏరు ఉధృతంగా రోడ్డుపై ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలను నిలిపి వేశారు. బోనకల్, ఖమ్మం ప్రధాన రహదారిలో రామకృష్ణాపురం వాగు ఉప్పొంగడంతో ప్రధాన రహదారిపైకి నీరు చేరింది. దీనితో అధికారులు రాకపోకలను నిలిపి వేశారు. సత్తుపల్లి, చంద్రుగొండ తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. కొణిజర్ల మండలంలోనూ తనికెళ్ల గ్రామం నుంచి గణేశ్వరం, తుమ్మలపల్లి, బోడియతండా, రామనర్సయ్య నగర్ తదితర గ్రామాలకు వెళ్లే రహదారిపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రఘునాథపాలెం మండల పరిధిలోని విఆర్ బంజర వద్ద బుగ్గవాగు పొంగి ప్రవహించడంతో పాపటపల్లి, విఆర్‌బంజర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్ నుంచి ఖమ్మం వచ్చే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాల్వంచ, శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో రోడ్డుపైకి నీరు చేరడంతో రాకపోకలను నిలిపి వేశారు. అశ్వారావుపేటలో నివాస ప్రాంతాల్లోకి నీరు చేరింది.

**వ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళనలో ప్రజలు...**

భారీ వర్షాల మూలంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. గుండాల మండలంలో ఓ బాలిక డెంగీ బారీనపడి మృతి చెందగా కొణిజర్ల మండలంలో ఇప్పటికే రెండు మరణాలు చోటు చేసుకున్నాయి. కూచిపూడి హరిత, స్వాతి మరణించగా పలువురు డెంగీ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రతి యేటా సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల బారీనపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని జ్వరపీడిత గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తపరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని మందులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

# నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

**ప్రజాపక్షం/ కొణిజర్ల :** భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను అంచనా వేసి ఎకరాకు రూ. 25వేల చొప్పున పరిహారం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. నదులు, ఏర్లు, వాగుల పరివాహక ప్రాంతాల్లో పంటలకు భారీ నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. సోమవారం సిపిఐ ప్రతినిధి బృందం కొణిజర్ల మండలంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు నీటమునిగిన ప్రాంతాలను పరిశీలించారు. తనికెళ్ల సమీపంలో నీట మునిగిన పంటలను పరిశీలించిన అనంతరం దండి సురేష్ మాట్లాడుతూ ఈ ఏడాది పంటలకు భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టపోయారని ఆయన తెలిపారు. నీటి పరివాహక ప్రాంతాలతో పాటు మెట్ట పంటలు ముఖ్యంగా పెసర, పత్తి పంటలు భారీ వర్షాల కారణంగా ఎర్రబారి ఎదుగు బొదుగు లేకుండా పోయాయని ఆయన తెలిపారు. పెసర అసలు దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సురేష్ తెలిపారు. జిల్లాలో 50వేల ఎకరాల్లో వివిధ రూపాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని నష్టం అంచనా వేసి తక్షణం పరిహారం అందించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా



కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మిడికంటి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, సిపిఐ, రైతు సంఘం నాయకులు మునిగ కోటేశ్వరరావు, యాసా వెంకటేశ్వరరావు, రత్తయ్య, నర్సింహారావు, సీతారాములు, నరేష్, బానోత్ రాములు, బానోత్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచి మండలంలో రేపు యూరియా పంపిణీ




**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని ఈనెల 3వ తేదీ నుండి సొసైటీ సెంటర్‌లో యూరియా పంపిణీ జరుగుతుందని కూసుమంచి మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కోసం వచ్చే రైతులకు కొన్ని సూచనలు చేసి సహకరించవలసిందిగా కోరారు. జక్కేపల్లి, చేగోమ్మ, కల్లూరిగూడెం సొసైటీలు, కొత్తగా ఏర్పాటు చేసిన సొసైటీ సబ్ సెంటర్ల నందు యూరియా పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానున్నదన్నారు. రైతులు యూరియా కోసం వచ్చేటప్పుడు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని, భూమి ఉన్న రైతు వచ్చినట్లయితే ఈపాస్ మిషన్‌లో వేలిముద్ర ద్వారా యూరియా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఒక వేళ అట్టి రైతు రాలేని పక్షంలో కుటుంబ సభ్యులను పంపిస్తే వారి మొబైల్‌కి వచ్చే ఓటీపీని వెంటనే చెప్పే విధంగా చూసుకోవాలని, లేదా వారి మొబైల్ నైనా ఇచ్చి పంపించాలన్నారు. రైతులు కచ్చితంగా గుర్తించవలసిన విషయం ఏంటంటే క్రింద సూచించిన విధంగా ఆయా గ్రామాల రైతులు కచ్చితంగా సూచించబడిన సెంటర్ వద్ద మాత్రమే యూరియాను తీసుకోవాలని, వేరే సెంటర్‌కి వెళ్తే యూరియా ఇవ్వబడటం జరుగుతుందని రైతులు గమనించాలన్నారు. చేగోమ్మ సెంటర్ నందు చేగొమ్మ, ముత్యాలగూడెం గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులు, జీళ్ల చెరువు గ్రామ పంచాయితీ నందు జీళ్ల చెరువు, కేశవాపురం, మునిగేపల్లి గ్రామాలకు సంబంధించిన రైతులు, పోచారం పాత గ్రామ పంచాయితీ సెంటర్ నందు పోచారం, కిష్టాపురం గ్రామాలకు సంబంధించిన రైతులకు, జక్కేపల్లి సెంటర్ నందు జక్కేపల్లి, జక్కేపల్లి ఎస్సీ కాలనీ గ్రామాలకు సంబంధించిన రైతులకు, జుజ్జులరావుపేట గ్రామంలోని కమ్యూనిటీ హాల్ నందు జుజ్జులరావుపేట, మల్లాయగూడెం గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, పెరికసింగారంలోని సొసైటీ గోడౌన్ నందు పెరికసింగారం, గోరీలపాడుతండా, అజ్మీరా హిరామాన్ తండా గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, గట్టు సింగారంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం నందు గట్టు సింగారం, లింగారం తండా, మల్లేపల్లి గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, ఈశ్వరమాదారంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం నందు ఈశ్వరమాదారం, మంగలి తండా, రాజుపేట, రాజుపేట బజార్ గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, పాలేరులోని పాత గ్రామ పంచాయితీ భవనం నందు పాలేరు, నరసింహులగూడెం గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, నాయకన్‌గూడెంలోని గ్రామ పంచాయితీ భవనం నందు నాయకన్‌గూడెం, భగత్వీడు గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, చౌటపల్లి గ్రామంలోని గ్రామ పంచాయితీ భవనంలో చౌటపల్లి, బోడియా తండా గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, గైగొల్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయితీ కార్యాలయానికి సమీపంలో గల డోర్ నెంబర్ 1, 12 నందు గైగొల్లపల్లి, లాల్‌సింగ్ తండా, సంధ్యాతండా గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, కొత్తూరులోని గ్రామ పంచాయితీ కార్యాలయం నందు కొత్తూరు, ఎర్రగడ్డతండా గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, గురవాయిగూడెంలోని వాటర్షెడ్ భవనం నందు గురువాయిగూడెం, ధర్మతండ, గంగబండ తండా గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, కూసుమంచిలోని సొసైటీ కార్యాలయం నందు కూసుమంచి, తుర్కగూడెం గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, లోక్యతండాలోని గ్రామ పంచాయితీ కార్యాలయం నందు లోక్యతండా, కోక్యతండా గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు, నేలపట్లలోని పాత లైబ్రరీ భవనం నందు నేలపట్ల, అగ్రహారం గ్రామ పంచాయితీలకు సంబంధించిన రైతులకు యూరియా పంపిణీ చేయబడుతుందన్నారు. కావున రైతులు పైన సూచించిన విధంగా ఆయా సెంటర్ల నందు మాత్రమే తీసుకోవాలని తెలిపారు.

# సిఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ

**ప్రజాపక్షం/చంద్రుగొండ :** ఈనెల మూడవ తేదీన మండల పరిధిలోని బెండలపాడు గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభ కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌లు పర్యవేక్షించారు. సోమవారం బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. సీఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే పర్యటన విజయవంతం అవుతుందన్నారు. అనంతరం చంద్రుగొండలో హెలిప్యాడ్ దామరచర్ల గ్రామంలో సీఎం పాల్గొననున్న బహిరంగ సభ స్థలాలను అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్‌డిఓ విద్యాచందన, హైజింగ్ పిడి రవీంద్రనాథ్, డిఎస్పీ అబ్దుల్, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, రహమాన్, ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు భోజ్య నాయక్, అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్ష, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, బొర్రా సురేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# భూమికి మేలు, భవిష్యత్తుకు వెలుగు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు గ్రామం నందు గణేష్ ఉత్సవాల్లో భాగంగా నీటి వర్ణ, మట్టి వినాయకుడిని స్థానిక దండాల చెరువులో నిమజ్జం చేసి, యువతకు ఆదర్శంగా యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, టిపిసి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్ నిలిశారు. ఈసందర్భంగా నవీన్ రాథోడ్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడే మన బాధ్యతలో భాగంగా నీటి వర్ణం, మట్టి తోరణంతో చేసిన వినాయకుడిని పూజిద్దామని, భూమాతను గౌరవిస్తూ, భవిష్యత్ తరాలకు శుభ భవిష్యత్తును అందించాలని తెలియజేస్తూ, భక్తిశద్ధలతో జై బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు పలికారు.

# బిఆర్ఎస్ మండల అధ్యక్షునిగా రామ్మూర్తి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలోని ఏవిఆర్ ఫంక్షన్ హాల్ నందు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్, రేగా కాంతారావు ఆదేశాల మేరకు జూలూరుపాడు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా చాపలమడుగు రామ్మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభినందనలు తెలిపారు.

# ఎన్యుమరేటర్లకు పారితోషకాన్ని అందించాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో 2024 సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబ ఆధారాలను సేకరించి సర్వే ను చేపట్టిన ఎన్యూమేరేటర్లకు పారితోషకాన్ని చెల్లించాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. గత నవంబర్లో సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి అందించడంతోపాటు అధికారులకు సహకరించామని అదేంతోపాటు శ్రమకు తగిన వేతనం ఇస్తామని చెప్పి అధికారులు పని చేయించుకున్నారని నేటికీ 11 నెలలు గడిచిన పారితోష్కాన్ని అందించలేదని ఇస్తానన్న పారితోషకాన్ని వెంటనే అందించాలని ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, మండల సిపిఐ కార్యదర్శి దామాల దయాకర్ రావు, ఐకెపి వివో ఏలు మెప్మా రిసోర్స్ పర్సన్లు సునీత ,కృష్ణవేణి, వెంకటరావమ్మా, మరియమ్మ ,లక్ష్మి , శివనాగలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు

# కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుంది : రేగా

**ప్రజాపక్షం/కరకగూడెం:** కాళేశ్వరం మీద కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచే దుష్ప్రచారం చేస్తూ వచ్చిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం కట్టకుండా కేసులు వేశారు, అనేక ఆరోపణలు చేశారు అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు దిగుతుంది అన్నారు. వాస్తవాలు పరిశోధనకు లోబడి, చట్టానికి లోబడి ఉండాలన్నారు. కానీ అవి అలా లేవు అన్నారు. కమిషన్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడింది అన్నారు. సీబీఐ, ఈడీ లతో దేశ రాజకీయాల్లో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలు వస్తున్నాయ్ అంటే సిబిఐ, ఈడీ లతో దాడులు చేస్తున్నారన్నారు. నిన్న కాళేశ్వరం కమీషన్ కేసును సిబిఐకి అప్పజెప్పిందు దొంగ రేవంత్ రెడ్డి అంటే.. సీబీఐ ని వాడుకొని కేసీఆర్ ను బద్నాం చేసి కాళేశ్వరాన్ని విఫలయత్నంగా చూపించి, ఆంధ్రా బనక చర్లకు లైన్ క్లియర్ చేసేందుకు మోడీ రేవంత్ చంద్రబాబు కలిసి పన్నిన దుష్ట పన్నాగమే ఇది అని తేలిపోయింది అన్నారు. మీరు సిబిఐకి ఇచ్చిన ఇంకా ఎటువంటి విచారణ కమిషన్‌లు వేసిన అదిరేది లేదు బెదిరేది లేదు అన్నారు. ఇందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిన్న, నేడు నిరసన కార్యక్రమాలకు బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపునివ్వడం జరిగింది అన్నారు. కావున భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గ కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేయవలసిందిగా పిలుపునిస్తున్నాను అన్నారు. కావున జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపిటీసీలు, పిఏసిఎస్ అధ్యక్షులు,మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, విద్యార్థి అండ్ యువజన నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బిసి అండ్ మైనార్టీ నాయకులు, సోషల్ మీడియా నాయకులు, ఉద్యమకారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ నిరసన కార్యక్రమాలకు తప్పక హాజరై, విజయవంతం చేయాలని రేగా కోరారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## -అదనపు కలెక్టర్లు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన పి. కావ్య కల్లూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో ఏడవ తరగతిలో సీటు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామ పంచాయతీ లింగంబంజర గ్రామస్తులు గ్రామంలో గతం నుంచి ఉన్న రోడ్డును ట్రాక్టర్ ద్వారా దున్ని చెడగొట్టిన వారిపై చర్యలు తీసుకుని రోడ్డును తిరిగి నిర్మించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం పార్శీబంధంకు చెందిన షేక్ ఆసియా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లకు చెందిన జి. సత్యనారాయణ పుట్టకోట చెరువు 50 ఎకరాలు ఆక్రమణకు గురైందని ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, చెరువు సుందరీకరణ, ఆధునీకరణ చేపట్టాలని దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్విరామ సేవలకు కృతజ్ఞతలు

## -అదనపు కలెక్టర్లు





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ పరంగా ప్రజలకు నిర్విరామ సేవలను అందించిన ఉద్యోగులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆగస్టు నెలలో పదవి విరమణ పొందిన 10 మంది ఉద్యోగులకు వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. సాంఘిక సంక్షేమ శాఖ డిడి కస్తాల సత్యనారాయణ, ముదిగొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్, శాంతినగర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ చాంద్‌పాషా, హార్టికల్చర్ శాఖకు చెందిన ఆఫీస్ సబార్డినేట్ వెంకటేశ్వరరావు, గిరిజన శాఖకు చెందిన హెడ్ మాస్టర్ కొర్రా శివ, వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి, లంకసాగర్ పిహెచ్‌సి సిహెచ్‌వో పుల్లమ్మ, వైరా పిహెచ్‌సి ఎంపిహెచ్‌ఎస్ పి. రాజ్యలక్ష్మి, కూసుమంచి తహసీల్దార్ కార్యాలయ సబార్డినెట్ నరసింహా, ట్రెజరీ విభాగం నేలకొండపల్లి ఎస్టివో అబ్దుల్ హఫీజ్ లు పదవి విరమణ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 30 నుంచి 35 ఏళ్ల పాటు ప్రజాసేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవి విరమణ తర్వాత కూడా తమ సలహాలు, సూచనలు అందించాలన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన వారిని అదనపు కలెక్టర్లు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం సాఫీగా నిర్వహించాలి

## -నిమజ్జన ఘాట్లను పరిశీలించిన కమిషనర్





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నగర పాలక సంస్థ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సాఫీగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులకు సూచించారు. సోమవారం ఖమ్మం నగరంలో నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఘాట్ల వద్ద రహదారులు, లైటింగ్, రక్షణ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శానిటేషన్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జనం సాఫీగా ఎటువంటి అంతరాయాలు లేకుండా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహించాలని అందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు అధికంగా వచ్చే ప్రాంతాల్లో రక్షణ కవచాల ఏర్పాటు, బారీకేడింగ్, లైఫ్ జాకెట్లు, రెస్క్యూ టీములను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా శోభాయాత్ర జరగనున్న ప్రధాన రూట్లను కమిషనర్ పరిశీలించారు. శోభాయాత్ర రూట్లలో ఎక్కడ ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని, ఎక్కడైనా చెట్ల కొమ్మలు, విద్యుత్ లైన్లు ఇతర అడ్డంకులు ఉంటే వాటి వల్ల ఎటువంటి ప్రమాదాలు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

**అర్జీల స్వీకరణ...**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అర్జీలను స్వీకరించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 31 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



ప్రజాపక్షం/ మధిర : నూతన ఫెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ నాయకులు షేక్.నాగూర్‌వలీ, ఎ.వినోద్‌రావు, బి.నాగరాజు, ఈ.వీరయ్య మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, నూతన ఫెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత ఫెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు షేక్.ఇబ్రహీం, కాజా సునీత, జిఎంఎస్ రాణి, బి.కవిత, కోశాధికారి బి.చెన్నయ్య, మండల కార్యదర్శులు మల్లరాజు షేక్.లాల్‌అహ్మద్, వూట్ల కొండలరావు, కె.ఆదాం, కె.రమేష్, లంక నాగేశ్వరరావు, బి.రమేష్, డి.మహేంద్రకుమార్, పెంటి రాంబాబు, నిమ్మగడ్డ గోపిచంద్, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/మధిర : ప్రస్తుత సమాజంలో ఎందరో యువత, మధ్య వయస్సు వారు అనేక చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను పాడుచేసుకుంటున్నారని, ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సంఘ సేవకులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు బాలరాజు అన్నారు. సోమవారం జిలుగుమాడులోని చేయూత మత్తు నివారణ పునరావాస కేంద్రం నందు షేర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జి.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిసై వికృతంగా, కృరంగా ప్రవర్తిస్తే జీవితాలు పతనం అవుతాయని, కుటుంబాలు చెల్లాచెదురు అవుతాయని, ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచి ప్రవర్తనతో మెలుగుతూ ఉన్నతంగా ఎదగాలని సూచించారు. జానపద కళాకారుడు లంకా కొండయ్య తన పాటల ద్వారా మత్తుకు బానిసైన వారికి చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో షేర్ ఎన్‌జి సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి డిజె పెట్టొద్దు



ప్రజాపక్షం/ బోనకల్ : మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక నిమజ్జన ఊరేగింపులకు డిజెకి ఎటువంటి అనుమతులు లేవని, ఎవరైనా చట్టాన్ని వ్యతిరేకించి డిజెను పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్న హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయకుని నిమజ్జన ఊరేగింపులో రాజకీయాలకు సంబంధించిన పాటలు గాని, పెద్ద పెద్ద సౌండ్ బాక్సులతో ప్రజలకు ఇబ్బంది కలిగించి గొడవలు పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిమజ్జనానికి కేటాయించిన సమయంలోనే మాత్రమే ఊరేగింపును ముగించుకుని నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేయాలని కోరారు. అత్యుత్సాహంతో అల్లర్లకు పాల్పడిన, బైకులతో రేసులు చేసినా, డిజెలను ఉపయోగించిన వెంటనే ఆ వాహనాలన సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు కొనసాగాలని, మండలం మొత్తం పోలీస్‌శాఖ పరిరక్షణలో ఉందని ప్రతిఒక్కరూ దీనికి సహకరించాలని ఎస్సై కోరారు.

# సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి



ప్రజాపక్షం/ బోనకల్ : ఫెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా బోనకల్ మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టి ఉపాధ్యాయ ఉద్యోగుల ఫెన్షన్ హక్కును కాలరాస్తున్నాయని, ఇప్పటికైనా సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత ఫెన్షన్ వర్తింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు రత్నాకర్, టిపిటిఎఫ్ నాయకులు యాకోబ్ పాషా, చిన్న రంగారావు, గోపాల్‌రావు, జల్లా కోటయ్య, పి.నర్సింహారావు, కె.నిర్మల, కె.సురేష్, కె.లక్ష్మణ్‌రావు, పావని, నాగశ్రీ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూల్‌కు మైక్ సెట్ వితరణ





ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని జిల్లా పరిషత్ హరిజనవాడ హైస్కూల్‌కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కుంచం కృష్ణారావు సౌజన్యంతో మహబూబాబాద్‌కు చెందిన దాతలు కొత్తూరి రాజేష్, భార్గవి దంపతులు(యుఎస్‌ఎ) ఆర్థిక సహకారంతో రూ.10వేలు విలువ చేసే మైక్ సెట్‌ను హైస్కూల్ హెచ్‌ఎం విజయశ్రీకి వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారుగుండ్ల వెంకటలక్ష్మి, నర్సింహామూర్తి, ప్రధాన కార్యదర్శి కాజా చక్రధరరావు, కపిలవాయి జగన్మోహన్‌రావు, సూర్యప్రకారావు, ఇరుకుళ్ళ సురేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# నష్టపరిహారం చెల్లించాలని రైతు వేడుకోలు



ప్రజాపక్షం/ బోనకల్ : అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా తన పొలం లోని మూడు కుంటలకు సంబంధించిన నష్ట పరిహారాన్ని అందించాలని బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుడిదే రామారావు అధికారులను వేడుకుంటున్నాడు. గ్రీన్‌ఫీల్డ్‌హైవే నిర్మాణం కోసం సర్వే నెంబర్ 219/అలో తనకున్న 2.3 ఎకరాల భూమిలో 3కుంటల భూమిని గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం అధికారులు తీసుకున్నారని, కాని ఇంతవరకు తనకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఆ 3కుంటలు భూమిలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు సంబంధించిన గ్రావెల్ తోలి పనులను నిలిపివేశారని, దీంతో తన పొలంలో పొలం పనులు చేసుకోవటానికి వీలు లేకుండా పోయిందని, తనకు రావాల్సిన నష్టపరిహారాన్ని కూడా ఇంతవరకు ఇవ్వకుండా, పొలం పనులను చేయనివ్వకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై సంబంధిత అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించిన తనకు పరిష్కార మార్గాన్ని చూపి 3కుంటల భూమికి సంబంధించిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

# పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల**



**ప్రజాపక్షం/ చింతకాని :** అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని నేరడ గ్రామంలో వరదలతో పంటలు నష్టపోయిన రైతులతో కలిసి పంటలను సిపిఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ చేతికి వచ్చిన పంటలు వర్షాల వల్ల దెబ్బతిన్నాయన్నారు. పెసర పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. నీట మునిగిన పంటలకు ఎకరానికి రూ. 20వేలు, వరి, మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ. 30వేలు, పత్తి రైతులకు ఎకరానికి రూ. 50వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. గ్రామంలో వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య చర్యలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు గోగుల ఆది, మట్టా రవి, కోటయ్య, గురుమూర్తి, గురవయ్య, శంకర్‌రావు, నాగుల మీరా, మస్తాన్, రసూల్, సాయి, తిరుపతిరావు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహిళల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరా మహిళా శక్తిపై సోమవారం సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, కొత్త సొసైటీ సంఘాల ఏర్పాటు, బ్యాంక్ లింకేజీ రుణాలు, ఏకరూప దుస్తుల కుట్టు పనులు, ఎర్రుపాలెం కల్లూరులో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, పెట్రోల్ బంక్ ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత పెంచేదిశగా పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించని మహిళలను గుర్తించి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో నమోదు చేయాలని ఏపిఎంల వారీగా లక్ష్యాలను కేటాయించారు. ప్రతి మండల పరిధిలో సమావేశం నిర్వహించుకుని ప్రణాళిక ప్రకారం అడ్మిషన్లు నమోదు చేయాలన్నారు. జిల్లా సమైక్యల సమావేశం రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అర్బన్ ప్రాంతంలో అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. సత్తుపల్లి పట్టణంలో ఎంపిక చేసిన స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు ప్రారంభించాలన్నారు. నిర్దేశిత లక్ష్యం ప్రకారం నూతన స్వశక్తి మహిళా సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ సన్యాసయ్య, డిపిఎం, ఏపిఎంలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

**-కలెక్టరేట్ ఎదుట డ్వాక్రా మహిళల నిరసన**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** డ్వాక్రా సంఘంలోని నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట డ్వాక్రా మహిళలు నిరసన చేపట్టారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట బోనకల్ మండలం గోవిందాపురం ఎ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు కండ్లకు నల్ల గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ నెల రోజుల క్రితం గ్రూపుల్లో నిధుల దుర్వినియోగం అయినట్లు గుర్తించామని తెలిపారు. ఏపిఎంను సంప్రదించగా గతంలో ఉన్న ఏపిఎం కట్టా సురేంద్రబాబు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఏపిఎం సురేంద్రబాబు బదిలీపై వెళ్లారని దీనికి సంబంధించి కొత్తగా వచ్చిన ఏపిఎం వెంకటేశ్వరరావును కలిసి ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించకపోగా పై అధికారులకు తప్పుడు సమాచారం అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏపిఎం గతంలో ఈ మండలంలో పని చేశారని ఆయన పాత్రపై కూడా మహిళలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో షేక్ షాహీహన్, బొబ్బిళ్ల రాధ, బొబ్బిళ్ల కిట్టమ్మ, వత్సవాయి కిట్టమ్మ, షేక్ హుస్సేన్, షేక్ లాలమ్మ, బొబ్బిళ్ల శైలజ, బొబ్బిళ్ల మంగమ్మ, బాగం దుర్గ, షేక్ షాహీన్, షేక్ జానబీ, షేక్ మైబు, షేక్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పకడ్బందీగా యూరియా పంపిణీకి సిద్ధం

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల పరిధిలో యూరియాను పకడ్బందీగా రైతులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామిరెడ్డి తెలిపారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ అనుదీప్ సూచనల మేరకు తిరుమలాయపాలెం మండల పరిధిలోని సొసైటీ కేంద్రాలతో పాటు మరో 10 గ్రామపంచాయతీ కార్యాలయాల్లో యూరియాను పకడ్బందీగా రైతులు అందించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, జల్లేపల్లి, బీరోలు, ఎర్రగడ్డ, తెట్టెలపాడు, పాతర్లపాడు, హైదర్‌సాయిపేట, తాళ్ళచెరువు, పైనంపల్లి, కాకరవాయి, సుబ్లేడు, మాదిరిపురం గ్రామపంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పరిధిలో ఉన్న 40 గ్రామపంచాయతీల రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకుని గ్రామపంచాయతీ కార్యాలయాలకు వెళ్లినట్లయితే ఒక రైతుకు ఒక యూరియా కట్ట అందించడం జరుగుతుందని, ప్రతి రైతు యూరియా కొరతను పరిగణలోకి తీసుకుని సహకరించాలని ఆయన తెలిపారు.

# రాయగూడెంలో 40 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని రాయగూడెంలో మరో 40 కుటుంబాలు కాంగ్రెస్ లో చేరారు. మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో నంబూరి రామారావు ఆధ్వర్యంలో సోమవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. వీరికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే గ్రామంలో గత మూడు రోజుల క్రితం 60 కుటుంబాలు చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు కొర్లకుంట్ల నాగేశ్వరరావు, కొడాలి గోవిందరావు, బోయిన బ్రహ్మం, బైరు లక్ష్మీనారాయణ, సూరేపల్లి ప్రేమ్ కుమార్, సూరేపల్లి ప్రభాకర్, బోయిన సారధి, తీగ రామయ్య, లక్క తిరపయ్య, నరేందర్, సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# జాలిముడి ప్రాజెక్టు కాల్వకు గండి

**-నీట మునుగుతున్న పొలాలు**



**ప్రజాపక్షం/ బోనకల్ :** గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని బ్రాహ్మణపల్లి కలకోట మధ్య గల జాలిముడి ప్రాజెక్టు కాల్వకు గండి పడింది. దీంతో ప్రాజెక్టు చుట్టుపక్కల ఉన్న పొలాల్లోకి భారీగా వరద నీరు చేరి మునిగిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. సంబంధిత అధికారులు గండి పూడ్చకపోవడంతో పై నుండి వస్తున్న భారీ వరదల వలన వరి పొలాలు నీట మునిగాయని, దీంతో తీవ్ర నష్టం జరిగిందని, ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జాలిముడి కాల్వకు మరమ్మత్తులు చేయించి తమ పంట పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# పలు కుటుంబాలకు లింగాల పరామర్శ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని మాటూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడిశెట్టి నాగేశ్వరావు తండ్రి ఇటీవల మృతి చెందగా సోమవారం దశదిన కర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్ రాజు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిరిపురం గ్రామంలో సీనియర్ నాయకులు వెలగపూడి శివప్రసాద్ దశదిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ రుణాలు పంపిణీ




**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని పెద్ద గోపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులకు చైర్మన్ శీలం అక్కిరెడ్డి, బ్యాంక్ మేనేజర్ దివ్యలు సోమవారం కొత్త రుణాలను అందించారు. సొసైటీలో ఉన్న రైతుల పాత అప్పును కట్టించుకుని కొత్తగా 93మంది సభ్యులకు గాను రూ.69.30లక్షలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిఇఓ వీరారెడ్డి, సూపర్వైజర్ సుధాకర్, యుగంధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ నిధులు జమ చేయకుండా దుర్వినియోగం చేసి నిబంధనలను వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై చర్య తీసుకోవాలని, అదేవిధంగా మున్సిపాలిటీలో జరిగిన మరిన్ని అవినీతిని బయటకు తీసి దోషులను శిక్షించాలని మున్సిపాలిటీ ఆదాయానికి దెబ్బకొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి విధులను తొలగించాలని సోమవారం ఐక్యవేదిక నాయకులు వైరా మున్సిపాల్ కమీషనర్ గురులింగంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో అవినీతి మయమైందని ఎవరికి వారే ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని మున్సిపాలిటీలో ఇటీవల దారి మళ్లిన నిధులపై కూడా పూర్తిస్థాయిలో విచారణ చేయాలని, అవినీతికి పాల్పడి తొలగించి మరల విధుల్లోకి తీసుకోవడం జరుగుతుందని, ఇలా చేయడం వల్లే అవినీతి తెచ్చి మీరు పోతుందని వారు అన్నారు. ఇలాంటి వారిపై అధికార యంత్రాంగం పోస్టులు చర్యలు తీసుకొని మున్సిపాలిటీ అభివృద్ధి పడే విధంగా కృషి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్ణకంటి రామారావు, ఓర్సు శ్రీనివాసరావు, పూర్ణకంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఇటీవల వర్షాలకు తడిసి, శిధిలావస్థలో ఉన్న ఇంటి ముందు భాగం కుప్పకూలింది. రెప్పపాటు లో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన వ్యాపారి శ్రీనివాస రావు ఓ అద్దె ఇంట్లో కిరాణం వ్యాపారం నిర్వహిస్తున్నారు. కాగా ఆ ఇల్లు శిథిలావస్థలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు తడిసింది. సోమవారం ఉదయం కిరాణం వ్యాపారం తీస్తుండగా ఒక్క సారిగా ఆ ఇంటి ముందు భాగం కుప్పకూలింది. ఆ సమయంలో కిరాణం కోసం ఎవరూ రాకపోవటంతో ప్రమాదం తప్పింది. ఆ ఇల్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటంతో ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. సదరు వ్యాపారి వెంటనే ఇంటిని ఖాళీ చేశారు.


# అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



ప్రజాపక్షం/భద్రాచలం : ఆదివాసీ గిరిజనులు స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధిని పెంపొందించుకునేందుకు అన్ని గుర్తింపు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులన ప్రతొక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో పిఓ గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వాటిని ఆయా శాఖలకు బదలాయించారు. ప్రతీ దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు వీలైనంత త్వరగా సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికశాతం సమస్యలు వ్యక్తిగత, భూ సమస్యలు, స్వయం ఉపాధి వంటివాటిపై వచ్చాయని, మొత్తంగా 160 దరఖాస్తులు అందినట్లు పిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఆర్‌సిఓ గురుకులం అరుణకుమారి, ఇఇ హరీష్, డిఎంహెచ్ఓ సైదులు, ఏఓ సున్నం రాంబాబు, ఏడి భాస్కర్, ఉదయ్‌కుమార్, లక్ష్మీ నారాయణ, ఆదినారాయణ, హరికృష్ణతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి



ప్రజాపక్షం/భద్రాచలం : ఏజెన్సీ ఏరియా పరిధిలోని భూములు, పంటల సాగు చేసుకుంటున్న గిరిజన రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించి సత్వర న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు దారులు అర్జీలు సమర్పించే సమయంలో అన్ని పత్రాలు, అర్హతలు, భూమికి సంబంధించిన డక్యూమెంట్లు సమర్పించాలని, వాటి ఆధారంగా రికార్డులు పరిశీలించి తప్పని సరిగా న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మణుగూరు, పురుషోత్తపట్నం, రామానుజవరం, అశ్వాపురం, చర్ల మండలంలోని జంగాలపల్లి, భద్రాచలంకు చెందిన పలువురు పలు రకాల దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజేంధర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి




**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్**
**- నేడు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ అన్నారు. సోమవారం శేషగిరి భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సం.ప్రారంభమై నాలుగు నెలల అగదుస్తున్నా విద్యరంగంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించకపోవడం శోచనీయం అన్నారు. గత విద్యా సం.లో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు విడుదల కాన కళాశాలల నుండి ఇంత వరకు వారి సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, దీంతో విద్యార్థులు చదువుల్లో ముందుకు సాగడం లేదన్నారు. ప్రభుత్వవిద్యను బలోపేతం చేస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు విద్యారంగ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమవుతున్నారని మండిపడ్డారు. మౌలిక వసతులు, బోధ న, బోధనేతర సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 2న కలెక్టరేట్ ముందు తలపెట్టిన ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, నాయకులు మహేష్, నవీన్, కళ్యాణ్ వంశీ పాల్గొన్నారు.

## భూములు త్యాగం చేసిన ప్రజలను విస్మరించిన బీటీపీఎస్ యాజమాన్యం

**ప్రజావాణి కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కి వినతి**



ప్రజాపక్షం/మణుగూరు: భూములు త్యాగం చేసిన ప్రజలను బీటీపీఎస్ యాజమాన్యం విస్మరించిందని మణుగూరు పాల్వంచ మాజీ జడ్పీటీసీ దుర్గ భద్రాచలం సబ్ కలెక్టర్ కి సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌స్థాపన సమయంలో భూములు కోల్పోయిన ప్రభావిత గ్రామాల్లోని భూ నిర్వాసితులలో మొదటి గ్రామం చిక్కుడుగుంట గ్రామ ప్రజలు తమ భూములు, ఇళ్లు, ఆలయాలు, జీవనాధారాలు త్యాగం చేశారని, కానీ ఇప్పటికీ ప్రభుత్వం, ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు కాలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు ప్రాజెక్ట్ ప్రారంభ సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, సీఎస్ఆర్ నిధులను పారదర్శకంగా వినియోగించి రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని, శుద్ధ తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేసి, నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని, ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు, శాశ్వత ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, కాలుష్య నియంత్రణ చర్యలు కఠినంగా అమలు చేసి, కాలుష్య నియంత్రణ బోర్డు ద్వారా క్రమం తప్పకుండా తనిఖీలు జరగాలని, బుగూరుపేటూగారం రహదారితో పాటు గ్రామ అంతర్గత రహదారులు తక్షణమే మెరుగుపరచాలని, కుటుంబాల యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు, నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందించాలని ఆమె డిమాండ్ చేశారు. కలెక్టర్, సబ్ కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని బీటీపీఎస్, ఆర్అండ్‌బీ శాఖ, కాలుష్య నియంత్రణ బోర్డును ఆదేశించి సమస్యలను పరిష్కరించాలని పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు.

# ఓటరు జాబితాలో తప్పులను సవరించండి

ప్రజాపక్షం/కల్లూరు: ఓటర్ల జాబితా తప్పులు తడకలను సవరించాలని కోరుతూ చెన్నూరు ఓటర్లు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. చెన్నూరుకు సంబంధించిన ఓటర్లు పేరువంచకు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉండటం వలన రాబోయే స్థానిక ఎన్నికల్లో నష్ట పోతామని తమ ఓట్లను మా గ్రామంలోని మా వార్డుల్లోనే ఉంచాలని లేనిచో ఆందోళన చేస్తామని కోరుతూ కల్లూరులోని ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు, రావికంపాడు, గ్రామాలకు చెందిన ఓటర్లతోపాటు మండల సిపిఐ కార్యదర్శి దయాకర్ రావులు ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.



# సిఎం పర్యటనతో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఈనెల 3వ తేదీన చంద్రుగొండ మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా వాహన దారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నట్లు డిఎస్పి రెహమాన్ సోమవారం తెలిపారు. వీఎం బజార్ నుండి చంద్రుగొండ మీదుగా కొత్తగూడెం వైపు వచ్చే వాహనాలు కల్లూరి,తల్లాడ, జూలూరుపాడు మీదుగా కొత్తగూడెంకు చేరుకోవాలన్నారు. అదే విధంగా కొత్తగూడెం నుండి వీఎం బజంర్ ప్రయాణించే వాహనదారులు జూలూరుపాడు, తల్లాడ, కల్లూరి మీదుగా వీఎం బంజర్ వైపు ప్రయాణించాలని సూచించారు. ఈ ట్రాఫిక్ మళ్లింపు నిబంధన మంగళవారం ఉదయం 10 గం. నుండి మొదలుకుని సా. 5గం. వరకు ఉంటుందని డిఎస్పి తెలిపారు. దీనిని ప్రజలు, ప్రయాణీకులు గమనించి సహకరించాలని కోరారు.

# ప్రాథమిక వైద్యశాలకు 8 బెడ్స్ వితరణ



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: సీపీ కంపెనీ మొక్క జొన్న వారు ఆళ్లపల్లి ప్రాథమిక వైద్యశాలకు 8 బెడ్స్, 2 నెబ్‌లైజర్స్ మిషన్స్, 2 ఐవి స్టాండ్‌లను వితరణగా అందించారు. ఈసందర్భంగా పిహెచ్‌సి తరపున సీపీ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపి, ప్రజల ఆరోగ్యం కోసం వితరణ చేయడం అభినందనీయమని ప్రాథమిక వైద్యశాల వైద్యులు రేవంత్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ సోమేశ్వర్, మండల వ్యాపారులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నాగేశ్వరరావు, అనమోలా వెంకటేశ్వరావు, బూరుగడ్డ రాములు, నరెడ్ల వెంకన్న, వెంకటాచారి, రమాదేవి, సీపీ కంపెనీ ప్రతినిధులు, పిహెచ్‌సి స్టాఫ్ పాల్గొన్నారు.

# సిసి రోడ్లు మంజూరు చేయాలి



ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట గ్రామపంచాయతీలో వరదలకు మందలపల్లి రోడ్డు నుంచి ఊరిలోకి వచ్చే అర్బన్ కాలనీ దగ్గర మీటర్ లోతు నీళ్లు రోడ్డుపై నిలిచి రాకపోకలకు తీవరాంతరాయం కలుగుతుందని సిపిఎం జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ అన్నారు. నెమలిపేటలో కొత్తగా నిర్మించిన వంతెన పోటెత్తి నెమలిపేట గ్రామస్తుల ఇళ్లపై పడి మోకాలి లోతు బురద పేరుకుపోతుందని, భారీ వర్షాలకు దమ్మపేట పంచాయతీలో నెలకొన్న పరిస్థితులపై సోమవారం సిపిఎం మండల నాయకత్వం సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీను, మురహరి రఘు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పున్నం సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వేపులపాటి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, పార్టీ సీనియర్ నాయకులు బాల బుచ్చయ్య, కాకర్లపల్లి పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బండి వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ కాలువ మధ్యలో కరెంటు స్తంభాలు



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని కరెంటు అధికారుల పనితీరుకు గంగబండ తండ పంచాయితీలోని బోటిమీది తండావాసులు విస్తుపోతున్నారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న కరెంటు లైన్‌కు గ్రామ పంచాయితీ డ్రైనేజీ కాలువ మధ్యలో కరెంటు స్తంభాలు నిల్పటం ఒక వింత పరిస్థితిగా మారింది. సహజంగా కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయడమంటే గట్టి బలమైన భూమిపై ప్రజలకు పశువులకు ప్రమాదకరంగా జరగకుండా కరెంటు స్తంభాలు నిలుపుతారు. కానీ ఇక్కడ అధికారులకు ఏమనిపించిందో ఏమో కానీ ఏకంగా నాలుగైదు స్తంభాలను గ్రామ పంచాయితీ డ్రైనేజీ కాలువ మధ్యలోనే నిలబెట్టడం గ్రామ ప్రజలకు అనుమానానికి దారి తీస్తుంది. ఇవి బురద కాలువలో బలంగా నిలుస్తాయా లేదా అంటూ అనుమానాలకు తావిస్తుంది. అంతే కాకుండా డ్రైనేజీ కాలువ నుండి నీళ్లు పోవడానికి ఈ స్తంభాలు ఆటంకంగా కూడా మారిపోవడం మరో సమస్యగా ఉన్నాయి. కరెంటు స్తంభాలను ప్రత్యేకమైన స్థలంలోనే ఏర్పాటు చేసి కొత్త కరెంట్ లైన్ ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా ఏర్పాటు చేయాలని బోటి మీది తండావాసులు కరెంట్ అధికారులను కోరుతున్నారు.

# ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి సమీపంలో తాళ్లూరు వెంకటాపురం వద్ద కొన్ని సంవత్సరాల క్రితం వాగు వద్ద ఆక్రమణకు గురైన స్థలం ద్వారా వరద ఉధృతికి పొలాలు ముంపుకు తరచూ గురికావడంతో పండే పంటలు నష్టానికి గురికావడం వలన అదేవిధంగా ప్రాంతంలో జమ్మి ఎక్కువగా పెరగడం వలన నీటిపారుదలకు అవకాశం లేనందున వెంట ఉన్న పంట పొలాలు మునిగి పోవడం చేపల చెరువుల వల్ల కూడా నీరు పోయేందుకు మార్గం లేనందున పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు పత్రం అందించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యను విన్నవించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దయాకర్ రావు, రామారావు, రామకృష్ణ, రెడ్డి పెద్ద కృష్ణ,మారేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆర్టీసి పరిరక్షణకు పోరాటమే మార్గం




**-ఎంప్లాయిస్ యూనియన్ సభలో దండి సురేష్**

ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఒక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందని అస్తిత్వమే ప్రమాదంలో పడిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఆర్టీసి పరిరక్షణకు హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసి ప్రైవేటీకరణ దిశగా ఆలోచన చేయడం శోచనీయమన్నారు. ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం డిపో కమిటీ సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. పిల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో క్రమేపి ప్రైవేటీకరణకు అవకాశం కల్పిస్తుందని ఇప్పటికే కొన్ని డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించారన్నారు. ఆర్టీసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసెత్తడం లేదని, ఆర్టీసి కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు, డిఏ, ఇతర ఆర్థిక విషయాలకు సంబంధించి ప్రభుత్వం తక్షణం పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసిలో ఎన్నడులేనివిధంగా వేధింపుల పర్వం ప్రారంభమైందని కార్మికులను వేధిస్తే సహించబోమన్నారు. ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బివిరెడ్డి, డిపో అధ్యక్షులు జగన్నాథం, కార్యదర్శి బుచ్చిబాబు, డిపో ఛైర్మన్ సిహెచ్ రమేష్, డిపో కోశాధికారి వెంకన్న, నాయకులు ఆదిలక్ష్మి, సుల్తానా, రమాదేవి, నాగమణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దండి సురేష్‌ను ఘనంగా సన్మానించారు.

## పోటు ప్రసాద్ జయంతి సందర్భంగా సైకిల్ వితరణ




ప్రజాపక్షం/ ఖమ్మం : దివంగత కమ్యూనిస్టు నాయకుడు, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి అమరజీవి పోటు ప్రసాద్ జయంతిని పురస్కరించుకుని ఓ విద్యార్థికి సైకిల్‌ను అందించారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు వారి సోదరులు తోట నాగకృష్ణ లు పోటు ప్రసాద్ జయంతిని పురస్కరించుకుని చైతన్యమోహన్ అనే ఐటిఐ చదివే విద్యార్థికి అందించారు. సిపిఐ కార్యాలయంలో ఉంటూ ఐటిఐ చదువుతున్న విద్యార్థి రోజు టేజు వెళ్లి రావడానికి అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకుని వారు ఈ సైకిల్‌ను ఉచితంగా అందించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు చేతుల మీదుగా సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల సుధాకర్, పోటు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ కల్పన అభినందనీయం

**-బిజెపి ద్వంద వైఖరి విడనాడాలి : సిపిఐ**



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన తీర్మానం చారిత్రాత్మకమని దీనిని సిపిఐ పూర్తిగా మద్దతునిస్తూ అభినందనలు తెలియజేస్తుందని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి తెలిపింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 42 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ అమలుకు సంబంధించి దొడ్డిదారి ప్రయత్నాలు కాకుండా నేరుగా అమలు చేసేందుకు బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని సురేష్ కోరారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి దొంగాట ఆడుతుందని ఆయన ఆరోపించారు. ఒకపక్క రిజర్వేషన్లు కల్పించాలని అంటూనే మరో పక్క పరోక్షంగా రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రజలు బిజెపి కపట నాటకాన్ని కనిపెట్టి తగు రీతిలో సమాధానం చెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# పల్లె ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

**మాజీ ఎమ్మెల్యే చంద్రావతి ఆవేదన**





ప్రజాపక్షం/కొణిజర్ల: తుఫానుల తర్వాత పల్లెల్లో పారిశుధ్య లోపం ప్రబలి, డెంగ్యూ, మలేరియా, పాముకాటు వంటి ప్రమాదకర వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి మండిపడ్డారు. కొణిజర్ల మండలం పెద్దగోపతి, కొణిజర్ల ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం అందక ఎందరో పేదలు అనారోగ్యంతో మృతి చెందుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుత ఆరోగ్య కేంద్రాల్లో 24గంటల వైద్యసేవలు తగినంత మంది డాక్టర్లు, సిబ్బంది అవసరమైన మందులు, మెరుగైన ఆసుపత్రి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వాలు తక్షణమే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆమె డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నాయకులు కిలారు మాధవరావు, బానోత్ వెంకన్న, ఖాదర్‌బాబు, భూక్యా వీరన్న, రాజ్‌కుమార్, ప్రసాదరావు, కె. నాగేశ్వరరావు, సుధాకర్, బందారు బ్రహ్మం, కృష్ణ, దొడ్డా సురేష్, ఉసికల చిరంజీవి, నాగయ్య, కె. వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

**- టిజిఇ జేఏసి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ .. జేసికి వినతి**





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ : ప్రభుత్వ ఉద్యోగులకు నష్టాన్ని తెచ్చిపెట్టే సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఇందుకోసం ప్రజాప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపాలని టిజి ఇ జేఏసి ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని సోమవారం పాల్వంచ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కార్యదర్శి వెంకట పుల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 2 లక్షల మంది ఉద్యోగులు ఈ సిపిఎస్ విధానంలో కొనసాగుతున్నారని, అటు ఉద్యోగుల, ప్రభుత్వ ధనం మొత్తం షేర్ మార్కెట్‌కు తరలించి ఇరు పక్షాలకు నష్టాన్ని చేకూరుస్తున్నారని, ఇప్పటికైనా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలో కూడా సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 30 నుండి 35 సం. పాటు ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన తర్వాత ఎలాంటి భద్రత లేకుండా బ్రతుకులు ఈడ్చాల్సి వస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు లక్షల మంది ఉద్యోగుల చిరకాల వాంఛ అయిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఇజేఏసి భాగస్వామ్య సంఘాలైన టిజిఒ, టిఎన్‌జిఒ, పిఆర్‌టియూ, యూటిఎఫ్, సిపిఎస్ యూనియన్, టిజిటిటిఎఫ్, టిఎస్‌టిటిఎఫ్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్, డ్రైవర్ల సంఘం, రెవెన్యూ సంఘం,టిజిఎల్‌వి 711 అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతులను ఆదుకోవాలి

**-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం**



ప్రజాపక్షం/ బోనకల్ : భారీ వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తక్షణం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. సిపిఐ మండల రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం బ్రాహ్మణపల్లి గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు పొరుపల్లి నర్సింహారావు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పలు పల్లపు ప్రాంతాల్లో సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కొన్ని చోట్ల ఇసుకమేటలు కూడా వేశాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పంటల నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని నర్సింహారావు కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యంగల ఆనందరావు, మండల నాయకులు రమేష్, నాయకులు కృష్ణ, నాగేశ్వరరావు, నర్సింహా, హన్మంతరావు లు పాల్గొన్నారు.

## హెచ్‌సిఏ లీగ్స్‌లో భద్రాచలం క్రీడాకారుల అద్భుత ప్రదర్శన







ప్రజాపక్షం/భద్రాచలం : హైదరాబాద్ క్రికెట్ లీగ్స్‌లో భద్రాచలంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమికి చెందిన ముగ్గురు అండర్ 14 క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఈ క్రీడారులు చూపిన ప్రతిభకు ప్రశంసల జల్లు కురుస్తోంది. పట్టణానికి చెందిన ప్రసన్న కుమార్ 75బంతుల్లో 79 పరుగులు సాధించి జట్టు గెలుపులో కీలక పాత్రపోషించాడు. మరో క్రీడాకారుడు చంద్ర 8 ఓవర్లు వేసి కేవలం 32 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని ముప్పతిప్పలు పెట్టాడు. ప్రేమ్‌సింగ్ అనే మరో ఆటగాడు 6 ఓవర్లు వేసి 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు. ఈ ముగ్గురులకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతున్న కుప్పాల శరత్ తేజను పలువురు అభినందిస్తున్నారు. ఈ క్రీడాకారులు భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# పెండింగ్ వేతనాలు బిల్లులు చెల్లించాలి



ప్రజాపక్షం/కల్లూరు: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు బిల్లులు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు భాగంగా కార్మికులకు నెలకు 10,000 వేతనం ఇస్తానన్న హామీని అమలు పరచాలని 2023 అక్టోబర్ నుండి అల్పాహార బిల్లులు పెండింగ్లో ఉన్నాయని తరగతి విద్యార్థిని బట్టి కాకుండా ప్రతి విద్యార్థికి మెనూ చార్జి 25 రూపాయలు చెల్లించాలని, ప్రతి కార్మికునికి 12 నెలల వేతనాలు చెల్లించాలని గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలను జమ చేయాలని కార్మికులకు ప్రమాద బీమా ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐమండల కార్యదర్శి దామాల దయాకర్ రావు అధ్యక్షురాలు పొగా సత్యవతి కార్యదర్శి రమాదేవి ధనమ్మ సుజాత మేరమ్మ సుశీల తో పాటు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అందించారు.